


# కరపత్రం

SINCE 2014

ఆదివారం సెప్టెంబర్ 27,2026 | సంపుటి : 2 | సంచిక : 349 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## దేశం గర్వించే నేత..

### ఆర్థిక సంస్కరణల శిల్పి మన్మోహన్ సింగ్: సీఎం రేవంత్ రెడ్డి

- గచ్చిబౌలిలో మన్మోహన్ సింగ్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ
- 1991 ఆర్థిక సంస్కరణలు దేశాభివృద్ధికి కీలకం
- పీవీ కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా సంస్కరణలకు శ్రీకారం
- ఆర్‌టీఐ, ఆర్‌టీఈ, ఉపాధి హామీ వంటి చట్టాల ప్రస్తావన
- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను గుర్తుచేసుకున్న సీఎం
- మన్మోహన్ ఆలోచనలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తి: రేవంత్
- కార్యక్రమానికి జస్టిస్ ఎన్.వీ. రమణ తదితరుల హాజరు

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశం గర్వించదగ్గ నేత అని కొనియాడారు సీఎం రేవంత్ రెడ్డి. జాతి రత్నాన్ని స్మరించుకోవడం తెలంగాణ ప్రజల అదృష్టమని అన్నారు. మన్మోహన్ సింగ్ పాలనలో తీసుకున్న నిర్ణయాలు, ముఖ్యంగా ఆర్థిక సరళీకరణ విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపాయని చెప్పారు. 1991లో పీవీ నరసింహారావు కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ చేపట్టిన సంస్కరణలు దేశం ఆర్థికంగా ఎదగడంతో ఎంతో కీలకమైనవని సీఎం చెప్పారు.

హైదరాబాద్ గచ్చిబౌలిలోని విప్రో జంక్షన్ వద్ద మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ కాంస్య విగ్రహాన్ని శనివారం(సెప్టెంబర్ 26) సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐటీ కారిడార్‌లో ఏర్పాటు చేయడం ద్వారా మన్మోహన్ దేశ ఆర్థిక రంగానికి చేసిన సేవలను గుర్తుచేసుకుంటున్నామని చెప్పారు. ుతిుజవశ్రీ+బఅఒవం ఢ ుతిుజవశ్రీశీస్త్రబవం

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ పాలన, ఆలోచనలు జెన్‌జీతో పాటు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో రైట్ టు ఇన్ఫర్మేషన్, రైట్ టు ఎడ్యుకేషన్, ఉపాధి హామీ, ఫారెస్ట్ రైట్స్, భూసేకరణ వంటి చట్టాలు, పథకాలు అమల్లోకి వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలోనూ అప్పటి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను సీఎం గుర్తుచేశారు. కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వీ. రమణతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మన్మోహన్ సింగ్ దార్శనికత, ఆర్థిక సంస్కరణలు, ప్రజా జీవితంలో ఆయన పాత్రను వారు స్మరించుకున్నారు.

## అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

- కరీంనగర్‌లో ప్రైవేట్ కార్యక్రమానికి హాజరు
- హైదరాబాద్‌కు వచ్చే అవకాశం
- తెలంగాణ నూతన ఇన్‌చార్జ్‌లతో భేటీకి ఛాన్స్
- పార్టీ ఆఫీస్ బేరర్లతో సమావేశం నిర్వహించే అవకాశం




హైదరాబాద్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటించనున్నారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అనంతరం హైదరాబాద్‌కు అమిత్ షా వచ్చే అవకాశం ఉందని.. ఇటీవల తెలంగాణకు కొత్తగా నియమితులైన ఇంఛార్జ్‌లతో భేటీ అయ్యే ఛాన్స్ ఉందని సమాచారం. అదే రోజు ఆఫీస్ బేరర్స్‌తో సమావేశం నిర్వహించే అవకాశమునట్లు తెలుస్తోంది.



## ఉమ్మడి వరంగల్‌పై సీతక్క ప్రత్యేక దృష్టి

- తొలిసారి ఉమ్మడి జిల్లాల అధికారులతో సమీక్ష
- అభివృద్ధి, పెండింగ్ పనులపై ఆరా
- నిధుల వినియోగం, గ్రామీణ మౌలిక వసతులపై చర్చ
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పనులపై సమీక్ష
- అధికార యంత్రాంగంతో నేరుగా సమన్వయానికి ప్రాధాన్యం
- ఉమ్మడి జిల్లా వ్యవహారాల్లో మరింత చురుగ్గా వ్యవహరించే అవకాశం

2లో..

## సైబర్ ముప్పులపై అప్రమత్తత అవసరం: సైబరాబాద్ పోలీస్ కమిషనర్



హైదరాబాద్: ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికతలతో పాటు పెరుగుతున్న సైబర్ ముప్పులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేశ్ అన్నారు. 'ఐసాకా హైదరాబాద్ చాప్టర్' 26వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన 'ఫ్యూజన్-2026' వార్షిక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా రక్షణ, సైబర్ సెక్యూరిటీ, రిస్క్ తదితర అంశాలపై చర్చించారు. డేటా రక్షణ, సైబర్ రిస్క్, డిజిటల్ మోసాల నివారణకు సంస్థలు, నిపుణులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. డీప్‌ఫేక్ వీడియోలు, ఓటీపీ ఆధారిత లావాదేవీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసాకా హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు సుజయ్ గంకిడి, ఉపాధ్యక్షుడు రాజ్ పవార్, సైబర్ సెక్యూరిటీ, ఆడిట్, రిస్క్ రంగాలకు చెందిన నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

## 'ఆ ఘనత మా అధినేత కేసీఆర్‌దే'

- సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరాలో వైఫల్యం
- అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్‌దే
- ట్రాన్స్‌కోపై రూ.36 వేల కోట్లు ఖర్చు చేశాం
- 28 వేల కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశాం
- విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోందని ఆరోపణ
- తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి




2 లో

## పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి.. దున్నపోతును తెచ్చుకున్నారు: కేటీఆర్



హైదరాబాద్: పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి.. ప్రజలు తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. పని చేస్తున్న ప్రభుత్వం కాళ్లల్లో కట్టెలు పెట్టొద్దనే కేసీఆర్ బయటికి రావట్లేదని తెలిపారు.




## నవంబర్ మధ్య నాటికి మూడు బ్యారేజీల పనులు ప్రారంభం

- 2027 వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేస్తాం: ఉత్తమ్
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు డిజైన్లు ఖరారు
- అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ కమిటీ ముందుకు డిజైన్లు
- గ్రౌటింగ్‌తో బ్యారేజీల పునాదుల బలోపేతం
- సాంకేతిక అనుమతుల తర్వాత టెండర్లు
- దీర్ఘకాలిక భద్రతకు ప్రాధాన్యం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజ్‌ల పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్ స్పష్టం చేశారు. నవంబర్ మధ్య నాటికి మూడు బ్యారేజ్‌ల పునరుద్ధరణ పనులు ప్రారంభించినున్నట్లు ఆయన తెలిపారు.



## అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రావాల్సిన అవసరం లేదు

- ఫారం-6 డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందన్న ఈసీ
- 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ పూర్తి
- ఓటర్ల జాబితాలో పేరు లేనివారు ఫారం-6తో దరఖాస్తు చేసుకోవచ్చు
- ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశాలు
- గోవాలో 97 మంది అర్హుల్లో 81 మంది ఫారం-6 దరఖాస్తు పూర్తి

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. సర్ నోటీసులు అందుకున్న ఓటర్లు.. అత్యవసరమైన సందర్భాల్లో తప్ప వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపింది. 'సర్' కోసం ఫారం-6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ , ఎన్నికల కమిషనర్లు డా.సుఖ్‌బీర్ సింగ్ సంధూ, డా.వివేక్ జోషి నేడు దిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. మిగతాద్ది 2 లో

## మిసెస్ మామ్ సీజన్ 10

- 10 రోజులు, 7 నగరాలు
- ఏపీలో 6 నగరాలు, 4 రోజుల పాటు హైదరాబాద్ లో
- దంపతుల సమగ్ర అనుభవం కోసం ఉచిత వారాంతపు విడిది
- కిమ్స్ కడల్స్ మరియు డా. శిల్పి రెడ్డి ఆధ్వర్యంలో




తొమ్మిది సీజన్లలో పాల్గొన్న వారిలో 85 శాతం సాధారణ ప్రసవాలు

హైదరాబాద్: గర్భిణులు, కాబోయే తల్లిదండ్రులకు గర్భధారణ, ప్రసవం, శిశు సంరక్షణపై అవగాహన కల్పించేందుకు కిమ్స్ కడల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మిసెస్ మామ్' కార్యక్రమం 10వ సీజన్‌లోకి అడుగుపెట్టింది. డా. కె. శిల్పి రెడ్డి ఆధ్వర్యంలో క్రయోవివా సహకారంతో ఈ కార్యక్రమాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు నగరాల్లో నిర్వహించనున్నారు. '10 ఇయర్స్ ఆఫ్ గ్లోయింగ్ మదర్స్.. గ్రోయింగ్ ఫ్యామిలీస్' అనే థీమ్‌తో అక్టోబరు 4 నుంచి డిసెంబరు 6 వరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. మిగతాద్ది 2 లో




## బీజేపీకి అవసరమైన చోటే ఓట్ల చోరీ: టీపీసీసీ చీఫ్

- తన ఓటు తొలగించేందుకు కుట్ర చేశారని వ్యాఖ్య
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని డిమాండ్
- 'సర్' ప్రక్రియలో ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపణ
- సోమవారం అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ భారీ నిరసనలు
- సీఈసీపై అవిశ్వాస తీర్మానానికి మద్దతు కూడగడుతున్న రాహుల్, ఖర్గే
- నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడిన టీపీసీసీ అధ్యక్షుడు

## ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పోటీ చేస్తాం: కవిత



హైదరాబాద్: రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం మాటల ప్రభుత్వమేనని.. చేతలు శూన్యమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్ ఫామ్‌హౌస్ పేరిట డ్రామాలు అడుతున్నారని మండిపడ్డారు. అంతా లోపాయికారీ ఒప్పందాలేనని.. ఫామ్‌హౌస్‌లపై చర్యలు ఉండవని ఎద్దేవా చేశారు. వచ్చే ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన పోటీ చేస్తుందని కవిత ప్రకటించారు.

## చిట్టీల పేరుతో రూ.10 కోట్లు వసూలు.. పరారీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు



# ‘ ఆ ఘనత మా అధినేత కేసీఆర్‌దే’

మొదటిపేజీ తరువాయి
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అటకెక్కించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ అధినేత కేసీఆర్ తెలంగాణను చీకటి నుంచి వెలుగులోకి తీసుకెళ్తే, ఇప్పుడు కాంగ్రెస్ ఆ వెలుగును నిలబెట్టడంలో విఫలమైందన్నారు. ప్రధానంగా సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ భవన్ నుంచి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ‘ సాధ్యం కాదన్న 24 గంటల విద్యుత్‌ను అన్ని రంగాలకు కొన్ని నెలల్లోనే అందించిన ఘనత కేసీఆర్‌ది. రూ. 36 వేల కోట్లను ట్రాన్స్ కో పై వెచ్చించిన నేత కేసీఆర్. ఎక్కడ కరెంటు పోయినా ఒక చోటి నుంచి ఇంకో చోటుకు విద్యుత్ అందించే వ్యవస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు.పవర్ ఉన్నా ఇవ్వలేము అని రాష్ట్రం ఏర్పాటైన తొలినాళ్ళలో అధికారులు అనే వారు. కేసీఆర్ సీఎంగా మొదటి రివ్యూ చేసింది విద్యుత్‌పైనే. మూడేళ్ల లోనే డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ మెరుగు పరిచి కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చారు. 28 వేల కిలోమీటర్లు విద్యుత్ లైన్లు వేశాం. అన్ని రకాల కేవీ సబ్ స్టేషన్ల సంఖ్యను ఎన్నో రెట్లు పెంచాం .ట్రాన్స్ కో లాభాల్లో నడుస్తోంది. ఈ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేస్తోంది. అవినీతి సొమ్ముకు ఆశపడి ప్రైవేటు పరం చేస్తున్నారు’ అని ధ్వజమెత్తారు.

# బీజేపీకి అవసరమైన చోటే ఓట్ల చోరీ: టీపీసీసీ చీఫ్

మొదటిపేజీ తరువాయి
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై తెలంగాణ కాంగ్రెస్ పోరును మరింత ఉధృతం చేసింది. నిజామాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీకి అవసరమైన చోట ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించిన ఆయన.. తన ఓటును కూడా తొలగించే కుట్ర జరిగిందని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసనలు చేపడతామని ప్రకటించారు.

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడారు. మహారాష్ట్ర, కర్ణాటకలో కాంగ్రెస్‌కు మెజారిటీ వస్తుంటే.. ఇతర రాష్ట్రాల్లో అదే పరిస్థితి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. ఒకే ప్రజలు ఓట్లు వేస్తున్నప్పుడు ఫలితాల్లో ఇంత వ్యత్యాసం ఎలా వస్తుందని ప్రశ్నిస్తూ.. బీజేపీ ఏ రాష్ట్రంలో గెలవాలనుకుంటే అక్కడే గెలుస్తోందన్న అనుమానాలు వ్యక్తం చేశారు. సర్ ప్రక్రియలో ఓట్ల తొలగింపు జరుగుతోందన్నది వాస్తవమని ఆయన ఆరోపించారు. అయితే దీనిని యాంత్రికంగా రుజువు చేయలేకపోవచ్చని అన్నారు. సర్‌పై యువతలో ఆందోళన ఉందని, అందుకే జెన్‌జీ తరహా నిరసనలు రోడ్లపైకి వస్తున్నాయని వ్యాఖ్యానించారు.

తెలంగాణ కాంగ్రెస్ గతంలోనూ సర్ ప్రక్రియలో 2002 ఓటర్ల జాబితాతో లింక్ చేసే నిబంధనపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం. ఆయన ఒక రాజకీయ పార్టీకి మారాడన్న కారణంగానే సమస్య వస్తోందని ఆరోపించారు. సీఈసీ వ్యవహారంపై కాంగ్రెస్ ఇప్పటికే దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో తెలంగాణలోనూ ఈ ఆందోళనలను చేపట్టనున్నట్టు తెలిపారు. తనకు పదిసార్లు ఓటు వేసిన నిజామాబాద్‌లోనే తన ఓటును తొలగించేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. కుట్రపూరితంగా నోటీసులు ఇచ్చారని అన్నారు. లౌకికవాదుల ఓట్లను తొలగించే ప్రక్రియ జరుగుతోందని ఆరోపించారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే కలిసి సీఈసీపై అవిశ్వాస తీర్మానానికి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# పట్టు బిగిస్తున్న సీతక్క!

మొదటిపేజీ తరువాయి
రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క ఉమ్మడి వరంగల్‌పై ప్రత్యేక దృష్టి సారించారా? అన్న చర్చ మొదలైంది. ప్రధానంగా ములుగు నియోజకవర్గ అభివృద్ధిపైనే దృష్టి సారిస్తూ వస్తున్న మంత్రి.. శుక్రవారం తొలిసారిగా ఉమ్మడి ఖమ్మంతోపాటు వరంగల్ జిల్లాల అధికారులతో హనుమకొండ ఐడీఓసీ వేదికగా సమీక్ష నిర్వహించడం ఆసక్తికరంగా మారింది.

సమీక్షలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఎల్‌నినో, వీబీ--జీ రామ్‌జీ, ఆర్‌డబ్ల్యూఎస్, హ్యామ్ రోడ్లపై మంత్రి చర్చించారు. కొండా సురేఖ మంత్రివర్గం నుంచి ఈ నెల 3న బర్తరఫ్ అయిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం ఉమ్మడి వరంగల్‌నుంచి కేబినెట్‌లో సీతక్క ఒక్కరే మంత్రిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తొలిసారిగా అధికార యంత్రాంగంతో మంత్రి నిర్వహించిన సమీక్షకు ప్రాధాన్యం ఏర్పడింది.

**ఉమ్మడి జిల్లాల అధికారులతో తొలి సమీక్ష.. పనుల పురోగతిపై ఆరా..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీతక్క.. తొలిసారిగా ఒక్కరే ఉమ్మడి జిల్లాల అధికారులతో శుక్రవారం హనుమకొండ ఐడీఓసీలో సమీక్ష నిర్వహించడం.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనులు, నిధుల వినియోగం, గ్రామీణ మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై ఆరా తీయడం ప్రాధాన్యంసంతరించుకుంది. ఉమ్మడి జిల్లాల అధికార యంత్రాంగంతో నేరుగా సమన్వయం చేసుకునేలా ఈ సమావేశం సాగినట్లు అధికార వర్గాలు కూడా చెబుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన సమీక్షతోనే ఈ ప్రక్రియ ముగుస్తుందా? లేక ఇకపై వరుస సమీక్షలు కొనసాగుతాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇస్తున్న సీతక్క.. ఇక ఉమ్మడి జిల్లా వ్యవహారాల్లో మరింత చురుగ్గా వ్యవహరించే అవకాశం ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

# తండ్రి మాటల్ని సవాల్‌గా తీసుకొని..
# ఇప్పుడు ‘ఆసియా హీరో’ స్థాయికి ఎదిగి!

చిన్నప్పుడు చదువు సరిగా ఒంటబట్టలేదు.. అలాగని అక్కడే ఆగిపోలేదు. పట్టుదలతో చదివి ఎంతో క్లిష్టమైన జేఈఈ లో ఉత్తీర్ణత సాధించారు. ఐఐటీలో ఇంజినీరింగ్ చదివినప్పటికీ.. ప్రజాసేవ పట్ల ఆసక్తితో ఐపీఎస్ అయ్యారు. ఇప్పుడు ఆసియా హీరోగా నిలిచారు. స్పష్టమైన లక్ష్యానికి నిబద్ధత తోడైతే ఉన్నత స్థాయికి వెళ్లొచ్చని నిరూపించారు ఐపీఎస్ అధికారి మొహిబుల్లా అన్సారీ.
2021 బ్యాచ్ బిహార్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి మొహిబుల్లా అన్సారీ .. అమెరికాలో అరుదైన గౌరవం అందుకోనున్నారు. ఆ దేశం ఏటా ఇచ్చే ఆసియా హీరో అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. ఈ ఏడాది డిసెంబర్ 13న అన్సారీ ఈ పురస్కారం స్వీకరించనున్నారు. ప్రస్తుతం బిహార్‌లోని ముజఫర్‌పుర్ నగరానికి ఎస్పీగా విధులు నిర్వర్తిస్తోన్న ఆయనకు.. యూఎస్ కు చెందిన అసోసియేషన్ ఆఫ్ వరల్డ్ ఫెయిర్ అండ్ ఫెస్ట్ ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు సమాచారం. ప్రజాసేవ, సామాజిక సంక్షేమం, శాంతి భద్రతలను కాపాడటంలో ఆయన చేసిన కృషికిగానూ ఈ గౌరవం దక్కింది.

**తండ్రి మాటలను సవాలుగా తీసుకొని..**

పది, 12 తరగతులకు పాఠశాలల్లో నిర్వహించే ప్రీబోర్డు పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు అన్సారీ . తాను వెనకబడటానికి



గల కారణాలు గుర్తించి తుది పరీక్షల్లో సాధారణ మార్కులతో గట్టెక్కారు. “నువ్వేమో ఐఐటీ సాధించాలని కలలు కంటున్నావ్.. ముందు పాస్ కావడానికి కావాల్సిన మార్కులు తెచ్చుకో” అంటూ తండ్రి అన్న మాటలు ఆయనపై బలమైన ప్రభావాన్ని చూపించాయి. వాటిని సవాల్‌గా తీసుకొని, రాత్రింబవళ్లు కష్టపడి చదివారు. గత వైఫల్యాలతో కుంగిపోకుండా పట్టుదలతో చదివిన ఆయన.. ఐఐటీ దిల్లీలో సీటు సంపాదించి బీటెక్ పూర్తిచేశారు. తర్వాత కొంతకాలం ఓ ఐటీ సంస్థలో పనిచేశారు. తన మనసు ప్రజాసేవ వైపు లాగడంతో.. సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమై, అఖిల భారత స్థాయిలో 389వ ర్యాంకు సంపాదించారు. దాంతో బిహార్ లో ఐపీఎస్‌గా విధులు నిర్వర్తిస్తూ.. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందారు.

# సీఈసీ వివాదం.. 30న ‘ఇండియా కూటమి’ నేతల భేటీ

దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కు ఒత్తిడి పెంచే దిశగా విపక్షాలు కార్యాచరణకు సిద్ధమయ్యాయి. ఈ అంశంపై చేపట్టాల్సిన ఆందోళనలపై చర్చించేందుకు ఇండియా కూటమి నేతలు ఈ నెల 30న దిల్లీలో భేటీ కానున్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తప్పించాలనే తమ డిమాండ్‌పై పరస్పరం సంప్రదింపులు జరిపి.. ఉమ్మడి నిర్ణయం తీసుకోనున్నారు. ఈ విషయంపై 29న కాంగ్రెస్ ప్రత్యేకంగా సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించి తదుపరి




కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం.

మరోవైపు, జ్ఞానేశ్ కుమార్ అభిశంసనకు మరోసారి పార్లమెంటు ఉభయ సభల్లో నోటీసులు ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన 73 మంది రాజ్యసభ సభ్యులతో కూడిన ప్రతిపక్ష కూటమి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ అభిశంసన నోటీసు ఇచ్చింది. అది రాజ్యసభలో పెండింగ్‌లో ఉంది. అది అలా ఉండగానే మరోసారి నోటీసు ఇవ్వాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. కాగా.. సర్ ప్రక్రియలో అవకతవకలు, ఇతర సమస్యలపై ఇప్పటికే 23 రాజకీయ పార్టీలు, ఓ స్వతంత్ర ఎంపీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ను సంప్రదించారు.

# పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి..
# దున్నపోతును తెచ్చుకున్నారు: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి
తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లు కేసీఆర్ బయటకు రాకపోయినా ఆదరణ తగ్గలేదన్నారు. ఆయన బయటకి కనిపించకపోయినా.. ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నారన్నారు. ప్రతి మహిళ, ప్రతి ఆడబిడ్డ ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమయానికి రైతుబంధు పడేదని గుర్తు చేస్తూ.. ఈ ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిందన్నారు.

# వారిని కాదు.. ధైర్యముంటే నన్ను అడ్డుకోండి

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సెరాంపుర్‌లో జరగాల్సిన తన ర్యాలీకి వెళ్లకుండా తమ వర్గం నేతలను భాజపా గూండాలు అడ్డుకున్నారని ఆరోపించారు. కొందరిని గృహ నిర్బంధం చేశారని..మరికొందరిని దారిలో అడ్డుకొని, వాహనాలు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమ వేదికకు వెళ్లే మార్గాన్ని సైతం తమ ఆధీనంలోకి తీసుకొని.. కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. నిజంగా ధైర్యముంటే తమ నేతలను కాకుండా తనను అడ్డుకోవాలని దీదీ భాజపాకు సవాల్ విసిరారు.‘మా నేతలు కొందరిని గృహ నిర్బంధంలో ఉంచారు. ర్యాలీ జరిగే ప్రదేశానికి వెళ్లనివ్వడం లేదు. కోర్టు అనుమతితోనే ర్యాలీ నిర్వహిస్తున్నాం. ఇది సజావుగా సాగేలా చూడడం పోలీసులు, అధికార యంత్రాంగం బాధ్యత. కానీ వారు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యదేశమైన భారత్‌లో ఇటువంటి దాడులు జరగడం సిగ్గుచేటు. ర్యాలీకి వెళ్లకుండా చేయడానికి ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆగేదీ లేదు. సభకు వెళ్లి ప్రసంగిస్తాను. సాధ్యమైతే నన్ను ఆపండి’ అని మమత పేర్కొన్నారు.

# అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రావాల్సిన అవసరం లేదు

మొదటిపేజీ తరువాయి
‘సర్’పై భిన్నాభిప్రాయాల అంశం తీవ్ర దుమారం రేపిన వేళ.. ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది.

కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి ఎన్నికల కమిషనర్లు రాసిన లేఖ.. ఈసీ లేదా ఐటీ విభాగాల విధానపరమైన అంశానికి సంబంధించినది కాదని, ఈసీకి డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ అధికారి పనితీరుకు సంబంధించిందని ఎన్నికల సంఘం వివరించింది. సీఈసీ, ఎన్నికల కమిషనర్ల సమావేశం అనంతరం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

**– ‘‘బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో ‘సర్’ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. తమ పేర్లు నమోదు కాకుండా మిగిలిపోయిన వారు, యువకులు, మొదటిసారి ఓటు వేసేవారు.. నిరంతర అప్‌డేషన్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు కోసం సంబంధిత ఈఆర్‌వోకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సీఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఓటర్ల నమోదుకు ఎన్నికల అధికారులు తక్షణమే స్పెషల్ డ్రైవ్ ప్రారంభించనున్నారు.**
**– దేశవ్యాప్తంగా ‘సర్’ నిర్వహణ సహా ఈ మధ్య కాలంలో ఈసీ అనేక నిర్ణయాలు తీసుకుంది. బిహార్ నుంచి మొదలు అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ కోసం గతేడాది జూన్ 24నాటి ఆదేశాలు ఎన్నికల కమిషన్ ఏకగ్రీవ ఆమోదంతోనే జారీ అయ్యాయి. దీన్ని సర్వోన్నత న్యాయస్థానం కూడా సమర్థించింది’’ అని ఈసీ తెలిపింది.**
**– గోవాలో 97 మంది అర్హులకు తుది ఓటర్ల జాబితాలో చోటుదక్కకపోవడంపై స్పందిస్తూ.. “ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హుల నుంచి దరఖాస్తులు సేకరణకు ఇంటింటికీ వెళ్లాలని సంబంధిత బూత్ స్థాయి అధికారులను గోవా సీఈవో ఆదేశించారు. ఆ 97 మంది ఓటర్లలో ఇప్పటికే 81 మంది ‘ఫారం-6’ నింపారు’’ అని వెల్లడించింది.**

# నవంబర్ మధ్య నాటికి మూడు బ్యారేజీల పనులు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి
(శనివారం, సెప్టెంబర్ 26వ తేదీ) హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కాళేశ్వరం బ్యారేజీల పనుల పునరుద్ధరణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు ఉత్తమ్.

2027 వర్షాకాలానికి ముందే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనులు పూర్తి చేస్తాం. మూడు బ్యారేజీల పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేశాం.అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందుకు డిజైన్లు తీసుకెళ్తాం. పుణేలోని సీడబ్ల్యూపీఆర్ఎస్‌లో డిజైన్లపై శాస్త్రీయ నమూనా పరీక్షలు నిర్వహిస్తాం.

ఎన్‌డీఎస్ఏ అభ్యంతరాలు, నిపుణుల సూచనలను పరిగణనలోకి తీసుకున్నాం. గ్రౌటింగ్ ద్వారా మూడు బ్యారేజీల పునాదుల బలోపేతం చేస్తాం. స్టిల్లింగ్ బేసిన్ల పొడిగింపు, కొత్త కట్-ఆఫ్ వాల్స్ నిర్మాణం చేపడతాం. పునాదుల స్థిరత్వం, నీటి చొరబాటు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సాంకేతిక అనుమతులు రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. పునరుద్ధరణ పనుల వ్యయ అంచనాలను సిద్ధం చేస్తున్నాం.

బ్యారేజీల భద్రత, పనుల నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. పునరుద్ధరణ పనుల్లో కఠినమైన నాణ్యతా ప్రమాణాలు, స్వతంత్ర పరీక్షలు నిర్వహిస్తాం. తాత్కాలిక మరమ్మతులు కాదు.. దీర్ఘకాలం మన్నేలా పునరుద్ధరణ చేపడతాం. పునరుద్ధరణ పూర్తయి భద్రతా అనుమతులు వచ్చాకే బ్యారేజీల నిర్వహణ చేపడతాం’ అని ఉత్తమ్ తెలిపారు.

# మిసెస్ మామ్ సీజన్ 10

మొదటిపేజీ తరువాయి
10 సీజన్ కు సంబంధించిన పోస్టర్ విడుదల కార్యక్రమాన్ని శనివారం కిమ్స్ కడల్స్ కొండాపూర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మిసెస్ మామ్ కార్యక్రమ రూపకర్త, ప్రముఖ గైనకాలజిస్ట్ డా. కె. శిల్పి రెడ్డి మాట్లాడుతూ ఈ పదో సీజన్, పది రోజుల పాటు ఏడు నగరాల్లో ఈ సీజన్ జరుగుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని ఆరు నగరాలు, హైదరాబాద్ లో నాలుగు రోజుల పాటు ఈ సీజన్ నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రతీ గర్భిణీ కూడా సాధారణ ప్రసవం అయ్యేలా చేయడమే తమ ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు.

గత 9 సీజన్లను విజయవంతగా పూర్తి చేసుకొని ఈ సారి పదో సీజన్ లోకి అడుగు పెడుతున్నామని తెలిపారు. ఈ సారి హైదరాబాద్ తో పాటు మరో ఆరు నగరాల్లో కర్నూలు, విజయవాడ, నెల్లూరు, విశాఖపట్నం, రాజమండ్రి, అనంతపురంలో మిసెస్ మామ్ కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. తొమ్మిది సీజన్లను విజయవంతంగా పూర్తి చేసిన ఈ కార్యక్రమం ద్వారా కాబోయే తల్లిదండ్రులకు గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రసవానికి సన్నద్ధత, శిశు సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు.

ప్రసూతి, స్త్రీ వైద్యులు, పిల్లల వైద్యులు, పోషకాహార నిపుణులు తదితర రంగాలకు చెందిన వైద్య నిపుణులు కార్యక్రమాల్లో పాల్గొని గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సూచనలు అందించనున్నారని పేర్కొన్నారు. గర్భధారణ సమయంలో ఎదురయ్యే సాధారణ సమస్యలు, ప్రసవం, గర్భిణులకు వ్యాయామాలు, యోగా, ఒత్తిడి తగ్గించుకునే పద్ధతులు, తల్లిపాలు, పుట్టిన బిడ్డ సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారని వివరించారు. గర్భధారణ అనేది కేవలం వైద్య పరీక్షలకు పరిమితం కాకుండా తల్లి, తండ్రి, కుటుంబ సభ్యుల శారీరక, మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాల్సిన ప్రయాణమని తెలిపారు. కాబోయే తల్లిదండ్రులకు సరైన అవగాహన, నమ్మకం కల్పించడమే ‘మిసెస్ మామ్’ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

# చిట్టీల పేరుతో రూ.10 కోట్లు వసూలు.. పరారీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు

మొదటిపేజీ తరువాయి
ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ.10 కోట్ల చిట్టీ డబ్బులతో పరారైన ఘటన సూర్యాపేట జిల్లాలో కలకలం రేపింది. ఆత్మకూర్ (ఎస్) మండలం శెట్టిగూడెం ప్రభుత్వ పాఠశాలలో భానోత్ రాజు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. చిట్టీల పేరుతో చివ్వెంల మండలం లక్ష్మీనాయక్ తండా, బోట్య తండా, ఏనెగంటి తండా, శెట్టిగూడెం, పిల్లలమర్రి తదితర గ్రామాల్లో వందలాది మంది నుంచి దాదాపు రూ.10కోట్లు వసూలు చేశాడు. పది రోజులుగా ఇంటికి తాళం వేసి ఉండటం, ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు. శనివారం సూర్యాపేట జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. బంధువుల నుంచే రాజు రూ.2కోట్లు వసూలు చేసినట్టు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కాలానికి ఎదురొడ్డి నిలుచున్న ప్రింట్ మీడియా

# డిజిటల్ మీడియా భవిష్యత్తు ఏమిటి?

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

▪ ప్రస్తుతం మనదేశంలో ప్రింట్ మీడియా ప్రపంచ ట్రెండ్‌కు భిన్నంగా స్థిరత్వంతో కూడిన వృద్ధిని కనబరుస్తూ, డిజిటల్ విప్లవాన్ని తట్టుకొని నిలబడుతోంది.

పాశ్చాత్య దేశాలలో ప్రింట్ మీడియా దాదాపు అంతరించిపోతున్న దశకు చేరుకోగా, భారతదేశంలో మాత్రం దాని క్రేజ్, నమ్మకం ఇంకా కొనసాగుతున్నాయి.

▪ డిజిటల్ మీడియా విప్లవంలో భాగంగా వచ్చిన యూట్యూబ్ న్యూస్ చానల్స్ ప్రారంభంలో ప్రత్యామ్నాయ మీడియాగా మంచి ఆదరణ పొందినప్పటికీ, ప్రస్తుతం తీవ్రంగా విశ్వసనీయతను కోల్పోతున్నాయి.

దీనికి ప్రధాన కారణం బాధ్యతాయుతమైన జర్నలిజం కంటే వాణిజ్య ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం.

▪ క్షేత్రస్థాయిలో విలేఖరులుగా ముద్ర వేసుకున్న వారు వివిధ రంగాల వాళ్లను వేధింపులకు గురి చేయడం మరియు డబ్బు వసూళ్లకు పాల్పడడం కూడా ఒక ప్రధాన కారణం.

దీనివల్ల యూట్యూబ్ చానల్స్ క్రేజ్ మరియు నమ్మకాన్ని కోల్పోతున్నాయి.

▪ ప్రస్తుత 2025-2026 సం.నివేదికల ప్రకారం మనదేశంలో ప్రింట్ మీడియా పరిస్థితి స్థిరంగా ఉంది.

**మార్కెట్ వృద్ధి మరియు ఆదాయ స్థిరత్వం** ఫిక్కీ-ఈవై (FICCI-EY) మరియు పిచ్ మాడిసన్ నివేదికల ప్రకారం, భారతదేశ ప్రింట్ మీడియా మార్కెట్ విలువ దాదాపు రూ. 25,900 కోట్ల వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

### ప్రకటనల జోరు

▪ కోవిడ్ తర్వాత ప్రింట్ మీడియాలో అడ్వర్టైజింగ్ (ప్రకటనల) ఆదాయం పుంజుకుంది. ముఖ్యంగా పండుగల సీజన్లలో రియల్ ఎస్టేట్, లగ్జరీ వస్తువులు, ఆటోమొబైల్ రంగాలు ఇప్పటికీ డిజిటల్ కంటే వార్తాపత్రికల ప్రకటనలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయి.

### ప్రాంతీయ భాషా పత్రికల హవా

▪ భారతదేశంలో ప్రింట్ మీడియా బలంగా ఉండటానికి ప్రధాన కారణం ప్రాంతీయ భాషా పత్రికలే.

ప్రాంతీయ భాషా పత్రికలను ఇంగ్లీషులో Vernacular Media అంటారు.

పట్టణాల్లో ఆంగ్ల పత్రికల సర్క్యులేషన్ కొంత తగ్గినప్పటికీ, గ్రామీణ, అర్ధ-పట్టణ (సెమీ అర్బన్) ప్రాంతాలలో స్థానిక భాషా పత్రికల సర్క్యులేషన్ 8-10% వార్షిక వృద్ధితో దూసుకుపోతోంది.

### నమ్మకమే' పెట్టుబడి

▪ సోషల్ మీడియా మరియు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో నకిలీ వార్తలు విపరీతంగా పెరిగిపోతున్న ఈ రోజుల్లో, జనం ఇప్పటికీ ప్రింట్ మీడియానే అత్యంత నమ్మకమైన వనరుగా భావిస్తున్నారు.

పత్రికల్లో వచ్చే సమాచారం ధృవీకరించబడినది కాబట్టి, ఉదయాన్నే పేపర్ చదవడం అనేది భారతీయుల దినచర్యలో ఒక ముఖ్యమైన అలవాటుగా మిగిలిపోయింది.

**ప్రింట్ మీడియా ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు** పరిస్థితి ఆశాజనకంగా ఉన్నప్పటికీ, ప్రింట్ మీడియా పరిశ్రమ కొన్ని తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది.

### న్యూస్‌ప్రింట్ ధరలు & పన్నులు

పత్రికలు ముద్రించే కాగితం న్యూస్ ప్రింట్ ధరలు మరియు దానిపై ఉన్న 5% కస్టమ్స్ డ్యూటీ భారం పబ్లిషర్లపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతోంది.

### యువత అలవాట్లు

▪ నేటి తరం యువత వార్తల కోసం స్మార్ట్‌ఫోన్లు, రీల్స్, షార్ట్ వీడియోలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు.

దీనివల్ల భవిష్యత్తులో కొత్త పాఠకులను ఆకర్షించడం ప్రింట్ మీడియాకు సవాలుగా మారింది.

### డిజిటల్ వైపు ప్రయాణం

ప్రకటనల బడ్జెట్‌లో ఎక్కువ శాతం గూగుల్, మెటా వంటి గ్లోబల్ టెక్ ప్లాట్‌ఫారమ్‌లకు మళ్లుతుండటంతో ప్రింట్ మీడియా కూడా తన వ్యూహాన్ని మార్చుకోవాల్సి వస్తోంది.

### ప్రస్తుత వ్యూహం

▪ ప్రింట్ + డిజిటల్ కలయిక మనుగడ సాగించడానికి దేశంలోని పెద్ద పత్రికలన్నీ ఇప్పుడు హైబ్రిడ్ మోడల్ వైపు అడుగులు వేస్తున్నాయి.




సొంతంగా ఈ-పేపర్లు (e-papers), వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లను నిర్వహిస్తూ, ప్రింట్ పాఠకులతో పాటు డిజిటల్ పాఠకులను కూడా ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

▪ చెప్పాలంటే, ప్రపంచవ్యాప్తంగా ప్రింట్ మీడియా సంక్షోభంలో ఉన్నప్పటికీ, భారతదేశంలో మాత్రం అది "సంక్షోభాన్ని తట్టుకుంటూ.. కొత్త టెక్నాలజీతో రూపాంతరం చెందుతూ" తన ప్రత్యేకతను చాటుకుంటోంది.

### డిజిటల్ మీడియా పరిస్థితి ఏమిటి?

▪ డిజిటల్ మీడియా విప్లవంలో భాగంగా వచ్చిన యూట్యూబ్, న్యూస్ చానల్స్ ప్రారంభంలో ప్రత్యామ్నాయ మీడియాగా మంచి ఆదరణ పొందినప్పటికీ, ప్రస్తుతం తీవ్రంగా విశ్వసనీయతను కోల్పోతున్నాయి. దీనికి ప్రధాన కారణం బాధ్యతాయుతమైన జర్నలిజం కంటే వాణిజ్య ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం.

యూట్యూబ్ చానల్స్ క్రేజ్ మరియు నమ్మకాన్ని ఎందుకు కోల్పోతున్నాయి?

▪ క్లిక్‌బైట్ థంబ్‌నెయిల్స్ & టైటిల్స్

వ్యూస్ పెంచుకోవడం కోసం థంబ్‌నెయిల్స్ మరియు టైటిల్స్‌లో అతిశయోక్తులు, పచ్చి అబద్ధాలు పెట్టడం సర్వసాధారణమైపోయింది.

లోపల ఉండే వార్తకు, బయట పెట్టే థంబ్‌నైల్‌కు అస్సలు సంబంధం ఉండదు. థంబ్‌నైల్ చూసి మోసపోయామని పాఠకులు గ్రహించడంతో ఈ చానల్స్‌పై నమ్మకం పోతోంది.

▪ అల్గారిథమ్ మరియు వ్యూస్ కోసం పాకులాట యూట్యూబ్ ఆదాయం పూర్తిగా వ్యూస్ మరియు వాచ్ టైమ్‌పైనే ఆధారపడి ఉంటుంది.

వార్తలోని నిజానిజాలను నిర్ధారించుకునే లోపే, వేరొకరు అప్‌లోడ్ చేస్తారనే కంగారులో అసత్య ప్రచారాలను, సగం నిజాలను క్షణాల్లో లైవ్ లేదా వీడియోల రూపంలో వదిలేస్తున్నారు.

### తగ్గిన జర్నలిజం విలువలు

▪ ప్రింట్ మరియు టీవీ లాంటి సాంప్రదాయ మీడియా లో ఒక వార్త బయటకు రావడానికి సబ్-ఎడిటర్స్, ఎడిటర్స్ వంటి పలు వడపోత దశలు ఉంటాయి.

కానీ యూట్యూబ్‌లో స్మార్ట్‌ఫోన్ మరియు ఇంటర్నెట్ ఉంటే ఎవరైనా 'జర్నలిస్ట్' అయిపోవచ్చు.

▪ సరైన శిక్షణ, నైతిక విలువలు లేకపోవడం వల్ల వ్యక్తిగత దూషణలు, సమాజంలో భయాందోళనలు సృష్టించే కంటెంట్‌ను ప్రసారం చేస్తున్నారు.

### రాజకీయ పక్షపాతం

▪ నిష్పక్షపాతంగా వార్తలు చెప్పాల్సిన చాలా చానల్స్, ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీకి కొమ్ముకాస్తూ లేదా వ్యతిరేకిస్తూ ఏకపక్షంగా మారుతున్నాయి.

▪ కేవలం తమకు నచ్చిన సిద్ధాంతాన్ని మాత్రమే వినిపించడం వల్ల తటస్థ పాఠకులు ఈ చానల్స్‌కు దూరమవుతున్నారు.

### సెన్సేషనలిజం, ప్రైవసీ ఉల్లంఘన

▪ చిన్న విషయాన్ని కూడా పెద్ద 'సంచలనం'గా మార్చడం, బాధితుల లేదా సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలను హద్దులు దాటి కెమెరాల్లో చూపించడం వల్ల వీక్షకులలో అసహ్యం కలుగుతోంది.

సెలబ్రిటీల విడాకులు, మరణాల వార్తలే సంచలన విషయాలు గా మార్చారు. ఈ విషయంలో థంబ్‌నైల్స్ పెట్టే తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

▪ ప్రభుత్వ నిఘా మరియు నిషేధాలు

▪ దేశ భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా నకిలీ వార్తలు ప్రచారం చేస్తున్న వందలాది యూట్యూబ్ న్యూస్ చానల్స్‌ను కేంద్ర ప్రభుత్వం ఐటీ చట్టాల కింద బ్లాక్ చేస్తోంది.

భారత సుప్రీంకోర్టు సైతం యూట్యూబ్ చానల్స్‌కు ఎలాంటి జవాబుదారీతనం లేదని పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ చర్యల వల్ల కూడా ప్రజల్లో వీటిపై నమ్మకం తగ్గుతోంది.

### ఆత్మహత్య చేసుకుంటున్న సోషల్ మీడియా

▪ తక్కువ ఖర్చుతో వార్తలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి యూట్యూబ్ ఒక అద్భుతమైన వేదిక అయినప్పటికీ.. "వ్యూస్ కోసం ఎంతకైనా తెగించడం" అనే ధోరణి వల్ల డిజిటల్ మీడియా తన సొంత చేతులతోనే విశ్వసనీయతను నాశనం చేసుకుంటోంది.

### మళ్లీ ప్రింట్ మీడియా పుంజుకుంటుందా?

▪ దీనికి కాలమే జవాబు చెప్పాలి. కానీ ఒకటి మాత్రం నిజం. ప్రింట్ మీడియాలో జవాబుదారీతనం ఉంటుంది, కాబట్టి ప్రజల్లో ప్రింట్ మీడియా పట్ల విశ్వసనీయత కూడా పదిలంగా ఉంటుంది. ఇదే ప్రింట్ మీడియాకు శ్రీరామరక్షగా ఉంటుందని ఆశించవచ్చు.

---

## లయోలా కాలేజీ విద్యార్థుల సోల్జరథాన్-2026'

# సమాజ సేవలో వాలంటీర్లుగా బాధ్యతలు

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

అల్వాల్‌లోని ప్రముఖ విద్యాసంస్థ లయోలా అకాడమీ డిగ్రీ & పి.జి. కళాశాల విద్యార్థులు సామాజిక బాధ్యతను చాటుకున్నారు.



ప్రతిష్టాత్మక "ఫెడరల్ బ్యాంక్ గన్నర్స్ సోల్జరథాన్ హైదరాబాద్ 2026" మెగా రన్‌కు ఒక రోజు ముందుగా శనివారం ఉదయం జరిగిన ఏర్పాట్లలో స్వచ్ఛంద సేవకులుగా వాలంటీర్లుగా పాల్గొని అంకితభావంతో సేవలు అందించారు.



### కళాశాల కమ్యూనిటీ

ఔట్రీచ్ ప్రోగ్రామ్ ·PLANET· లో భాగంగా, B.Sc. Computer Science & Cognitive Systems విభాగానికి చెందిన విద్యార్థులు ఈ భారీ సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

### క్రమశిక్షణతో కూడిన సేవలు

కార్యక్రమ నిర్వాహక బృందానికి సహకరిస్తూ రేస్ డే ఏర్పాట్లు సజావుగా సాగేలా విద్యార్థులు చురుకైన పాత్ర పోషించారు.

ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, ఆర్మీ సోల్జర్‌థాన్ కోఆర్డినేటర్లు డా. సారిక శర్మ, శ్రీ వినయ్ కుమార్ల సమక్షంలో విద్యార్థులు విధులు నిర్వహించారు.

రన్నర్లకు సంబంధించిన రేస్ T-షర్టులు, BIBల పంపిణీ, గూడీ బ్యాగ్‌ల ప్యాకింగ్, స్పాట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.

అలాగే రేస్ సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్ సేవలు, ఇన్వెంటరీ, లాజిస్టిక్స్ మరియు క్యూ మేనేజ్‌మెంట్ వంటి బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వహించారు.

### యాజమాన్యం అభినందనలు

కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. బి. బాబు, కరస్పాండెంట్ డా. రెక్స్ ఏంజెలియో, వైస్ ప్రిన్సిపాల్స్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాగ్నిటివ్ విభాగాధిపతి ఎమ్. రవి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ శ్రీ స్టీఫెన్ ఆశీర్వాదం పర్యవేక్షించారు.

▪ ఈ వాలంటీరింగ్ ద్వారా విద్యార్థుల్లో కమ్యూనికేషన్, లీడర్‌షిప్, టీమ్‌వర్క్ మరియు ఈవెంట్ మేనేజ్‌మెంట్ వంటి ఆచరణాత్మక నైపుణ్యాలతో పాటు దేశ సేవ, సమాజ సేవ పట్ల నిబద్ధత పెంపొందాయని కళాశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించింది.

---

## తెలంగాణ బిజెపి సారథ్యం

# మళ్లీ బండి సంజయ్ కే అప్పగిస్తారా!

గజెల్లి రాజేంద్రప్రసాద్, సోషల్ ఎనలిస్ట్




▪ బిజెపి కేంద్ర పార్టీ నాయకత్వం తెలంగాణపై విస్తృత ఆలోచనలు చేస్తున్నది. కొత్త నిర్ణయాలు తీసుకుంటోంది. దక్షిణాది రాష్ట్రాల పైన దృష్టి పెట్టి కేంద్రంలో నాలుగవసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి వ్యూహాలు రచిస్తున్నది.

ఈ సారి తెలంగాణ పైన భారీ ప్లాన్ తో సిద్ధం అవుతున్న బిజెపి అధినాయకత్వం కీలక మార్పుల దిశగా కసరత్తు చేస్తోంది. త్వరలోనే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో నాయకత్వ మార్పుకు సమాయత్తం అవుతున్నట్లుగా సమాచారం తెలుస్తున్నది.

▪ ఆపరేషన్ తెలంగాణ

తెలంగాణలో బిజెపి కొత్త స్కెచ్ సిద్ధం చేసింది. ఈ మేరకు పార్టీ నాయకత్వమే నేరుగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం ఆపరేషన్ తెలంగాణ అమలుకు నిర్ణయించింది.

తెలంగాణ కేంద్రంగా కొత్త నిర్ణయాలకు బిజెపి అధినాయకత్వం సిద్ధం అవుతోంది. అందులో భాగంగా జనవరిలో రాష్ట్ర పార్టీ బాధ్యతలు మార్పు ఉంటుందని పార్టీలో ముఖ్య నేతల మధ్య చర్చ కొనసాగుతోంది.

▪ **2028 లో తెలంగాణలో జరిగే అసెంబ్లీ ఎన్నికల పైన ఈ సారి బిజెపి హైకమాండ్ ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. హర్యానా, పశ్చిమ బెంగాల్ లో అమలు చేసిన ఫార్ములాతో తెలంగాణ లో ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నట్లుగా అర్థం అవుతున్నది. ఇందు కోసం తాజాగా ఇంఛార్జ్ లను నియమించింది. ఇక, పార్టీ నేతల మధ్య సమన్వయం పైనా కఠినంగా వ్యవహరిస్తోంది.**

▪ ఈ సమయంలోనే బిజెపి నాయకత్వం ఆరెస్సెస్ అభిప్రాయాలను సైతం తీసుకుంటున్నట్లుగా తెలుస్తున్నది. తెలంగాణ రాష్ట్ర బిజెపి ప్రస్తుత అధ్యక్షుడు రామచంద్రరావు కు కొత్త ఆలోచనలతో ఇతర బాధ్యతలు అమ్మకిచ్చే అవకాశం ఉంది అని తెలుస్తున్నది. తటస్థులను, జెన్ జి తరాన్ని పార్టీ వైపు తిప్పే బాధ్యతలను అప్పగించే అవకాశం ఉందని సమాచారం అందుతున్నది.అందులో భాగంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో దిగనున్నారు. హైదరాబాద్ కేంద్రంగా కొత్త వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది.

ఇక, గత అసెంబ్లీ - పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో పార్టీకి పెరిగిన బలాన్ని మరింత పెంచే కసరత్తు చేస్తోంది. గతంలో సాధించిన సీట్లు, ఓట్లతో వచ్చే ఎన్నికల కోసం ముందు నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే కలిసి వస్తుందని పార్టీ నాయకత్వం భావిస్తోంది.

**దీంతో, పార్టీ అధ్యక్ష బాధ్యతలు తిరిగి బండి సంజయ్ కు అప్పగించే ఆలోచనలో ఉన్నట్లుగా పార్టీ ముఖ్య నేతల సమాచారం. బండి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో దూకుడుగా వ్యవహరిస్తూ పార్టీ లో జోష్ పెంచటంతో పాటుగా గ్రేటర్ లో దాదాపు 50 మంది కార్పోరేటర్లను గెలిపించుకున్నారనే అంశం ఇప్పుడు ప్రస్తావనకు వస్తోంది.**

▪ పార్టీ నేషనల్ చీఫ్ నితిన్ నబీన్ సైతం తెలంగాణ పైన ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు సమాచారం. అమిత్ షా సహా.. కేంద్ర మంత్రులు వరుసగా తెలంగాణలో పర్యటించేలా ప్లాన్ చేస్తున్నారు. జనవరిలో తెలంగాణ కేంద్రంగా బీజేపీ నాయకత్వం కీలక మార్పులు.. నిర్ణయాలతో సిద్ధం అవుతున్న వేళ... రాజకీయంగా ఆసక్తి నెలకొంది.

కరపత్రం తెలుగు దిన పత్రిక

ఆదివారం సెప్టెంబర్ 27,2026

# పది ఎకరాల భూదానం.. వేలాది ఆడబిడ్డల భవిష్యత్తుకు పునాది

- వసంత నాగేశ్వరరావు దాతృత్వం నేటికీ వేలాది కుటుంబాలకు వెలుగునిస్తోంది
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వెల్లడి

**కరపత్రం ప్రతినిది , నందిగామ, సెప్టెంబర్ 26 :** నందిగామ పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కూటమి నేతలు, అధ్యాపక సిబ్బందితో కలిసి మాజీ హోం, నీటిపారుదల శాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు చిత్రపటాన్ని ఆవిష్కరించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆయన సేవలను, దాతృత్వాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, ఈరోజు మనం ఆవిష్కరిస్తున్నది కేవలం ఒక మహనీయుని చిత్రపటాన్ని మాత్రమే కాదు.. నందిగామలో ఈ విద్యా దేవాలయం ఆవిర్భావానికి కారణమైన ఆయన దార్శనికతకు కృతజ్ఞతాభివందనం అని అన్నారు. 1988లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు మహిళా విద్యాభివృద్ధికి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని, ఉమ్మడి రాష్ట్రంలోని ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో ఒక్కొక్క ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేసి మహిళలకు సాంకేతిక విద్యను చేరువ చేయాలని సంకల్పించారని గుర్తుచేశారు. ఉచితంగా స్థలం ఇచ్చే దాతలు ఉన్న ప్రాంతాల్లోనే ఈ కళాశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో, నందిగామ ఆడబిడ్డలు సాంకేతిక విద్యలో ముందుకు సాగాలనే మహోన్నత సంకల్పంతో వసంత నాగేశ్వరరావు







ముందుకు రావడం నందిగామ ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. నందిగామ ప్రాంత మహిళల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విలువైన 10 ఎకరాల భూమిని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల కోసం ఉచితంగా దానం చేయడం ఆయన విశాల హృదయానికి నిదర్శనమని కొనియాడారు. ఆనాడు ఆయన చేసిన నిస్వార్థ భూదానం కారణంగానే నేడు నందిగామలో ఈ విద్యా సంస్థ ఏర్పడి వేలాది మంది విద్యార్థినులకు సాంకేతిక విద్యను అందిస్తూ మహిళా సాధికారతకు కేంద్రంగా నిలిచిందని అన్నారు. వసంత నాగేశ్వరరావు దాతృత్వం కేవలం పాలిటెక్నిక్ కళాశాలకే పరిమితం కాలేదని, అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా నందిగామ పరిసర ప్రాంతాలకు చెందిన పేద మహిళలు కుట్టుపని తదితర వృత్తి నైపుణ్యాలను నేర్చుకుని స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. వసంత నాగేశ్వరరావు చేసిన పది ఎకరాల స్థలదానం కేవలం భూదానం కాదు.. వేలాది మంది ఆడబిడ్డల భవిష్యత్తుకు మీరు వేసిన గట్టి పునాది అన్నారు. ఆనాడు మీరు చల్లిన విత్తనం నేడు మహావృక్షంగా మారి ఎందరో ఆడబిడ్డలకు విద్యా నీడను అందిస్తోంది అన్నారు. ఇక్కడ చదువుకుని ఉద్యోగాలు సాధించిన అమ్మాయిలు తమ కుటుంబాలను నిలబెట్టుకోవడమే కాకుండా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు అన్నారు. నిజం చెప్పాలంటే.. మీరు ఇచ్చింది పది ఎకరాల భూమి కాదు.. వేలాది కుటుంబాల జీవితాలకు ఇచ్చిన ఉజ్వలమైన వెలుగు" అని తంగిరాల సౌమ్య భావోద్వేగంగా అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన, సీమంతాలు



**కరపత్రం ప్రతినిది గోదావరిఖని సెప్టెంబర్ 26:** రామగుండం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ మాసాత్సోతవాలు ఘనంగా నిర్వహించారు. గోదావరిఖని పరశురాంనగర్- 1 ఏరియాలోని పలు కేంద్రాల్లో చిన్నారులకు సామూహిక అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు చేసి పౌష్టికాహారం పంపిణీ చేశారు. చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, మొలకెత్తిన గింజలు, కూరగాయలు ప్రదర్శించారు. వైవిధ్య భరితమైన ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. రోజువారీ భోజనంలో ఆకు కూరలు, పప్పుధాన్యాలు, పాలు, గుడ్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సమతుల్య ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం.నిర్మల, పీ.శ్రీలత, హెల్పర్ తిరుమల, మహిళలు, గర్భిణులు పాల్గొన్నారు.

# శాతవాహన యూనివర్సిటీ వద్ద చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**కరపత్రం ప్రతినిది కరీంనగర్** రేకుర్తి 21వ డివిజన్ శాతవాహన యూనివర్సిటీ ఎదుట చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాలరెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ముఖ్య అతిథి గా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగాల నాగేశ్వర్ రెడ్డి స్పష్టం మాట్లాడుతూ ఐలమ్మ పోరాట స్ఫూర్తి, చూపిన పోరాట పటిమ అభినందనీయమని, ఆమె మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు, యువకులు , పార్టీ కార్యకర్తలు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు పరశురాములు గౌడ్, పింగిలి ప్రతాప్ రెడ్డి, గోద నరేష్, దయ్యాల మల్లేశం, అప్పల శ్రీనివాస్, పచ్చునూరి నరేందర్, బీజేవైఎం నాయకులు ప్రమోద్, దర్శనాల మహేందర్, భరత్, సాయిరాం, హస్తపురం ఆంజనేయులు, హస్తపురం విక్రం, గోలే లక్ష్మణ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

# 28న కరీంనగర్‌లో 'శాతవాహన గ్రామీణ సంత' వాల్ పోస్టర్ ఆవిష్కరణ...

- పోస్టర్ ను ఆవిష్కరించిన మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్.

**కరపత్రం ప్రతినిది కరీంనగర్** పర్యావరణ పరిరక్షణ, వ్యాధుల నివారణ, ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ఈనెల 28న కరీంనగర్లో గ్రామ భారతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న "శాతవాహన గ్రామీణ సంత" వాల్ పోస్టర్‌ను శనివారం రోజున మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆవిష్కరించారు.విష రహిత ఆహార ఉత్పత్తిదారులు, చేతివృత్తుల వారు , వినియోగదారులకు పరస్పర



తోడ్పాటును అందించే ఏకైక లక్ష్యంతో ఈ సంతను నిర్వహిస్తున్నట్టు గ్రామ భారతి బాధ్యులు తెలిపారు. సెప్టెంబర్ 28 సోమవారం ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు కరీంనగర్ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ గార్డెన్లో ఈ సంత జరుగుతుందని తెలిపారు.

మొత్తం 60 స్టాల్స్‌తో, అంచనాగా 1200 మంది వినియోగదారుల భాగస్వామ్యంతో ఈ సంత జరగనుందన్నారు.

ఈ కార్యక్రమంలో డి.ఇ. వెంకటేశ్వర్లు, ఎ.ఇ. సతీష్‌తో పాటు శాతవాహన గ్రామీణ సంత రాష్ట్ర, జిల్లా కార్యకర్తలు జిన్నా సత్యనారాయణ రెడ్డి, రఘురాం రెడ్డి, నాల్యా మడుగుల శంకరయ్య, గాలిపెల్లి నాగేశ్వరరావు, కూర్మాచలం మునీందర్, గొల్లె తిరుపతి, క్యాస మధు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# తలేల్మ గ్రామంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుక



**కరపత్రం ప్రతినిది ,అందోలు సెప్టెంబర్ 26:** అందోలు మండలంలోని తాలెల్మ గ్రామంలో,తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా,అందోలు మండల రజక సంఘం అధ్యక్షులు గడి కాడి యాదగిరి మాట్లాడుతూ..

భూమి కోసం,భుక్తి కోసం వెట్టిచాకిరి విధానానికి వ్యతిరేకంగా భూస్వాముల గడీలపై తిరుగుబాటు చేసిన తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ అని ఆయన కొనియాడారు.అనంతరం ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగన్నగౌడ్, మాణిక్యం గౌడ్ లు, తాలెల్మ గౌడ సంఘం పెద్దలు చెన్నయ్య గారి నారాయణగౌడ్, భీమయ్య గారి మల్లేశం గౌడ్, రజక సంఘం గ్రామ మాజీ అధ్యక్షుడు మనోహర్, నర్సింలు, చింటూ, మొగుళ్ళప్ప తదితరులు పాల్గొన్నారు.

# భవద్గీత జ్ఞాన మందిరంలో ఘనంగా అన్నదానం

**కరపత్రం ప్రతినిది జమ్మికుంట: సెప్టెంబర్ 26** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని భవద్గీత జ్ఞాన మందిరంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి పురం వేణు--నాగలక్ష్మి, పురం సురేష్--విజయ కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా భవద్గీత జ్ఞాన మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

భక్తులకు ఆహారం అందించడంతో పాటు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ఎంతో పుణ్యప్రదమైన విషయమని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతి శనివారం భవద్గీత జ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి భక్తులు, దాతలు



తమవంతు సహకారం అందిస్తూ ముందుకు రావడం అభినందనీయమన్నారు.

అన్నదానం ద్వారా ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడమే కాకుండా సమాజంలో సేవాభావాన్ని పెంపొందించవచ్చని నిర్వాహకులు తెలిపారు. భక్తి, సేవ, దానధర్మాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కొనసాగుతున్న ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు.

ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణకు దాతలుగా వ్యవహరించిన పురం వేణు--నాగలక్ష్మి, పురం సురేష్--విజయ కుటుంబ సభ్యులకు భవద్గీత జ్ఞాన మందిరం నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి కుటుంబాలు ఎల్లప్పుడూ సుఖశాంతులతో ఉండాలని, శ్రీకృష్ణ భగవానుని కృపాకటాక్షాలు నిరంతరం వారి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.

వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, భగవంతుని ఆశీస్సులు వారి కుటుంబ సభ్యులందరిపై ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు భక్తులు, దాతలు మరింతగా సహకరించాలని నిర్వాహకులు కోరారు.

# ఐఎంఏ పిడుగురాళ్ల వైద్యులకు నిరంతర వైద్య విద్యా కార్యక్రమం

**కరపత్రం ప్రతినిది , పిడుగురాళ్ల, సెప్టెంబర్ 25:** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిడుగురాళ్ల శాఖ మరియు ఐఎంఏ అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ (ఏ ఎమ్ ఎస్) పిడుగురాళ్ల సంయుక్త ఆధ్వర్యంలో, శ్రేష్ఠ హాస్పిటల్స్, గుంటూరు సహకారంతో శుక్రవారం రాత్రి ఐఎంఏ హాల్, పిడుగురాళ్లలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం ( సీఎంఈ ) విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రేష్ఠ హాస్పిటల్స్‌కు చెందిన నిపుణ వైద్యులు వివిధ ఆధునిక వైద్య అంశాలపై ప్రసంగించారు. డా. నాగార్జున గొట్టిపాటి, డా. గోకనపూడి శ్రీరామ్, డా. రాజేష్ గోలి, డా. తేజోకృష్ణ కల్లూరి, లు పలు అంశాలపై శాస్త్రీయ ప్రసంగాలు చేశారు. ఆధునిక రోగ నిర్ధారణ, చికిత్సా విధానాలు మరియు క్లినికల్ ప్రాక్టీస్‌లో తాజా పరిణామాలపై




జరిగిన ఈ సమావేశంలో వైద్యులు నిపుణులతో చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం ప్రసంగించిన నిపుణ వైద్యులను శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం ఐఎంఏ పిడుగురాళ్ల అధ్యక్షులు మరియు ఐఎంఏ ఏ ఎమ్ ఎస్ పిడుగురాళ్ల చైర్మన్ డా. ధూళిపాళ్ల భరత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఐఎంఏ ఏ ఎమ్ ఎస్ పిడుగురాళ్ల కార్యదర్శి



డా. జి.వి. శివ కృష్ణ కాంత్, జాయింట్ సెక్రటరీ డా. బి. మణిదీప్ , ఇతర కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు. ఈ సీఎంఈ కార్యక్రమానికి పిడుగురాళ్ల మరియు పరిసర ప్రాంతాలకు చెందిన వైద్యులు హాజరై శాస్త్రీయ చర్చల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన శ్రేష్ఠ హాస్పిటల్స్, గుంటూరు యాజమాన్యానికి ఐఎంఏ పిడుగురాళ్ల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# శాతవాహన యూనివర్సిటీ వద్ద చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**కరపత్రం ప్రతినిది కరీంనగర్** రేకుర్తి 21వ డివిజన్ శాతవాహన యూనివర్సిటీ ఎదుట చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాలరెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు.ముఖ్య అతిథి గా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగాల నాగేశ్వర్ రెడ్డి స్పష్టం మాట్లాడుతూ ఐలమ్మ పోరాట స్ఫూర్తి, చూపిన పోరాట పటిమ అభినందనీయమని, ఆమె మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు, యువకులు , పార్టీ కార్యకర్తలు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు పరశురాములు గౌడ్, పింగిలి ప్రతాప్ రెడ్డి, గోద నరేష్, దయ్యాల మల్లేశం, అప్పల శ్రీనివాస్, పచ్చునూరి నరేందర్, బీజేవైఎం నాయకులు ప్రమోద్, దర్శనాల మహేందర్, భరత్, సాయిరాం, హస్తపురం ఆంజనేయులు, హస్తపురం విక్రం, గోలే లక్ష్మణ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేటలో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవాలు

-బాయ్ బాయ్ గణేశా.. భక్తితో వీడ్కోలు పలికిన భక్తులు
-శోభాయాత్రలో స్టెప్పులేసిన మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి
-భక్తులను ఆకట్టుకున్న బాల గణేష్ విగ్రహాలు
-వివేకానంద యూత్ మండపంలో లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్న నాగభూషణం

**కరపత్రం ప్రతినిది ,అందోలు సెప్టెంబర్ 26:** సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. గత తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలు అందుకున్న గణనాథులను ఒకపక్క బాధ, మరోపక్క భక్తితో గంగమ్మ ఒడికి తరలించారు.



పట్టణంలో వివేకానంద యూత్, వాసవి నగర్ టీం, శ్రీ పోచమ్మ యూత్, తూర్పు గౌని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అందులో చిన్ని కృష్ణుని అవతారంలో దర్శనమిచ్చిన బాల గణపతి, గజరాజుతో



కూడిన బాల గణేష్, గులాబీ చీరలో దర్శనమిచ్చిన గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**ఉత్సాహపరిచిన చైర్మన్ ఆట:**



వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుని నిమజ్జన శోభాయాత్రలో ఆందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి కాగితపు పూల వర్షం మధ్య డ్యాన్స్ చేసి యువకుల్లో ఉత్సాహం నింపారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, నృత్యాల మధ్య భక్తులు గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేశారు.

**లడ్డూ ప్రసాదానికి పోటీ:**

వినాయక లడ్డూ ప్రసాదం కోసం ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు పోటీపడ్డారు. రూ.20 వేల నుండి రూ.4 లక్షల వరకు వేలం పాట జరిగింది. వివేకానంద యూత్ మండపంలో లడ్డూ ప్రసాదాన్ని జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డీ.బీ. నాగభూషణం రూ.77,500/-లకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురోత్తంరెడ్డి, సారా శివకుమార్, కాలనీ ప్రముఖులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిమజ్జనాలు ప్రశాంతంగా ముగిశాయి.